నేడు రాష్ట్రానికి నడ్డా



భువనేశ్వర్, న్యూస్‌టుడే: భాజపా కేంద్ర శాఖ అధ్యక్షుడు, ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా గురువారం భువనేశ్వర్ పర్యటనకు వస్తున్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటయ్యే కార్యక్రమంలో ఆయన మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులకు దిశా నిర్దేశం చేస్తారని పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ బుధవారం భువనేశ్వర్‌లో విలేకరులకు చెప్పారు. సభ్యత్వాల నమోదు పరిశీలిస్తారని, అనంతరం నడ్డా పూరీ జిల్లా సువాండోలో ఏర్పాటయ్యే మరో కార్యక్రమంలో పాల్గొని దిల్లీ ప్రయాణమవుతారని తెలిపారు.

రాష్ట్రపతితో భేటీ

దిల్లీ పర్యటనలో ఉన్న శాసనసభాపతి సురమా పాఢి, ఉప సభాపతి భవానీశంకర్ భోయ్ మంగళవారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్మును గౌరవ పూర్వకంగా కలుసుకుని కొద్దిసేపు ముచ్చటించారు. -న్యూస్‌టుడే, భువనేశ్వర్



పెళ్లికి ఒప్పుకోలేదని ప్రేమజంట ఆత్మహత్య

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితిలో కుటుంబసభ్యులు తమ వివాహానికి ఒప్పుకోలేదని ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. ఐఐసీ ప్రశాంత్‌కుమార్ శెఠి తెలిపిన వివరాల ప్రకారం... కుందేయి ఠాణా పరిధిలో భరుఖామహులి గ్రామానికి చెందిన యువకుడు (18), అదే గ్రామానికి చెందిన యువతి (16) ఆరు నెలలుగా ప్రేమించుకుంటున్నారు. వీరి కుటుంబాల మధ్య విభేదాలు ఉండడంతో వీరి వివాహానికి రెండు కుటుంబాలు అంగీకరించలేదు. దీంతో ప్రేమికులు మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. రాత్రయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో రెండు కుటుంబాల సభ్యులు వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించగా, గ్రామ శివారులో ఉన్న అడవిలో ఓ చెట్టుపై ఉరికి వేలాడుతూ మృతదేహాలు కనిపించాయి. వీరు ఆత్మహత్య చేసుకొన్నట్లు భావిస్తున్నారు. పరీక్షల అనంతరం పోలీసులు మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

బాలేశ్వర్‌కు సాయం ప్రకటించిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వరదలతో అతలాకుతలమైన బాలేశ్వర్ జిల్లాకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి మంగళవారం రాత్రి సాయం ప్రకటించారు. వర్షాధార పంట పొలాలకు హెక్టారుకు రూ.8,500, నీటిపారుదల సౌకర్యం ఉన్న పొలాలకు హెక్టారుకు రూ17 వేలు చెల్లిస్తామన్నారు. పూరింటి గోడలు విరిగిపోతే రూ.8 వేలు చొప్పున అందజేస్తారు. మత్స్యకారుల పడవలు పూర్తిగా పాడైతే రూ.15 వేలు, పాక్షికంగా పాడై ఉంటే రూ.4 వేలు, వలలకు రూ.3 వేలు అందిస్తారు. ఆవులు, గేదెలు మృతి చెంది ఉంటే ఒక్కొక్కదానికి రూ.37,500 చొప్పున, మేకలు, గొర్రెలకు రూ.4 వేలు సాయం అందుతుంది. వంటపాత్రలు కోల్పోయిన వారికి రూ.2,500లు, పశువుల శాలలకు రూ.3 వేలు చొప్పున చెల్లింపులు జరుగుతాయి. బాలేశ్వర్‌లో వరదల వల్ల వాటిల్లిన నష్టాలపై అధ్యయనం నివేదిక ఇంకా ప్రభుత్వానికి అందలేదు. ఇది అందిన వెంటనే ఆర్థిక సాయం అందించేందుకు వీలుగా ముందస్తు వివరాలు ప్రకటించినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

పారిశ్రామిక ప్రాజెక్టులకు పచ్చజెండా

రూ.4954 కోట్ల పెట్టుబడులు... 24 వేల మందికి ఉపాధి



సమావేశంలో అహుజా, ఇతర అధికారులు

రాయగడ పట్టణం, భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 31 కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 18 జిల్లాల్లో ఏర్పాటు కానున్న వీటి కోసం వివిధ సంస్థలు రూ.4,954 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. కొత్త ప్రాజెక్టులకు ఏర్పాటుకానున్న జిల్లాల జాబితాలో రాయగడకు చోటు లభించింది. వీటి ద్వారా మొత్తం 24,162 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మనోజ్ అహుజా అధ్యక్షతన మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి సింగిల్ విండో క్లియరెన్స్ అథారిటీ (ఎస్ఎల్ఎస్‌డబ్ల్యూసీఏ) వీటికి క్లియరెన్స్ ఇచ్చింది. మెకానికల్, విద్యుత్తు, వ్యవసాయం, ఆహారం, వస్త్ర, ఎలక్ట్రానిక్ తదితర రంగాల్లో ఆయా సంస్థలు పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నాయి. రాయగడ, ఖుర్దా, బరగఢ్, సువర్ణపూర్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, అనుగుల్, జాజ్‌పూర్, భద్రక్, కటక్, జగత్సింగ్‌పూర్, బాలేశ్వర్, ఢెంకనాల్, పూరీ, కొరాపుట్, కేంద్రపడ, మయూర్‌భంజ్, సుందర్‌గఢ్ జిల్లాల్లో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. భద్రక్ జిల్లాలో నెప్టనస్ షిప్ బిల్డర్స్ అండ్ రీసైకిలర్స్ సంస్థ రూ.934.54 కోట్లతో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలో అత్యధికంగా 11,536 మందికి, రాయగడ జిల్లాలో ఇంఫా పరిశ్రమ (తెరువలి) రూ.139.9 కోట్లతో స్థాపించనున్న ఇథనాల్ ఇంధనం ప్రాజెక్టు ద్వారా 135 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

అనుమతులు లభించిన కొన్ని ముఖ్య ప్రాజెక్టుల వివరాలను పరిశీలిస్తే...

సంస్థ / పరిశ్రమ	పెద్దుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి
కాల్డెరిస్ ఇండియా రిఫ్రాక్టరీస్	689.71	375
షాలిమార్ గ్లాస్ వర్క్స్, లిమిటెడ్	475.54	450
డెనిమ్ అండ్ ట్విల్స్ ప్రైవేట్ లిమిటెడ్	130	4500
సూర్య ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్	80	769
మా చిన్న మస్తిక ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్	104	440
ఇంఫా	139.9	135
ఎస్ఎస్ఎం హోటల్, రిసార్ట్స్ లిమిటెడ్	212.25	205

రేషన్ గోదాంపై దాడి



స్వాధీనం చేసుకున్న నిత్యావసర సరకులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: అక్రమంగా నిత్యావసర సరకులు విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో జిల్లా యంత్రాంగం మంగళవారం ఓ డీలర్‌కు చెందిన గోదాంపై దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసరాలను కాశీనగర్ ఎన్ఏసీలోని 9వ వార్డుకు చెందిన శ్రీనివాసరావు అక్రమంగా ఇతర ప్రాంతాలకు విక్రయించుకుని, సొమ్ము చేసుకున్నట్లు యంత్రాంగానికి సమాచారం అందింది. దీంతో పాలనాధికారి బిజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి అదనపు పౌర సరఫరాల శాఖ అధికారి బిష్ణు పరిడా, మార్కెటింగ్ ఇన్‌స్పెక్టర్ సుబేందు పాణిగ్రహి ఓ బృందంతో రేషన్ గోదాంపై దాడి చేశారు. సంబంధిత పత్రాలు తనిఖీ చేయగా తప్పుడు లెక్కలు ఉండడంతో సరకులు స్వాధీనం చేసుకుని, రేషన్ గోదాంను సీజ్ చేశారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం



దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంత్రి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, అణగారిన బతుకుల్లో జ్యోతులు వెలిగించడానికి చివరి వరకు ఉద్యమించారని వాణిజ్య, రవాణా, ఉక్కు గనుల శాఖల మంత్రి బిభూతి భూషణ్ చెప్పారు. బుధవారం గోపాల్‌పూర్ పట్టణ పరిధిల్లో దీనదయాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిభూతి మాట్లాడుతూ... జన్మనిచ్చిన తల్లులు, మాతృభూమికి సేవలు చేయాలన్నారు. ఈ కార్యక్రమం తరువాత పట్టణ పరిధిలో మత్స్యకారుల వీధుల్లో పర్యటించిన మంత్రి ఇంటింటికి వెళ్లి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కొంత మందితో భాజపా సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పొంచుబెహరా, మహిళా మోర్చా నాయకురాలు ఎన్.భూలక్ష్మి, యువమోర్చా నేత నారాయణ పాల్గొన్నారు.



సభ్యత్వాలు నమోదు చేస్తున్న బిభూతి

దీనకృష్ణ మిశ్రకు నిజ నిర్ధారణ పరీక్షకు అనుమతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సస్పెండైన భువనేశ్వర్‌లోని భరత్‌పూర్ ఠాణా ఐఐసీ దీనకృష్ణ మిశ్రకు నిజ నిర్ధారణ (పాలీగ్రాఫ్) పరీక్ష నిర్వహించనున్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్ ల్యాబొరేటరీలో ఈ పరీక్ష చేయించడానికి భువనేశ్వర్ ఎస్‌డీజేఎం న్యాయస్థానం క్రైంబ్రాంచ్‌కు బుధవారం అనుమతించింది. ఈ నెల 17 రాత్రి భరత్‌పూర్ ఠాణాలో రక్షణశాఖ అధికారి, ఆయన స్నేహితురాలిపై పోలీసులు చేయి చేసుకున్న ఘటనపై క్రైంబ్రాంచ్ దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ కేసుల పూర్వాపరాలు అధ్యయనానికి ప్రభుత్వం జస్టిస్ చిత్తరంజన్ దాస్ కమిషన్‌ను నియమించింది. కమిషన్ విచారణ ప్రారంభించడానికి మరో నాలుగురోజుల సమయం పట్టే సూచనలున్నాయి. మరోవైపు క్రైంబ్రాంచ్ బుధవారం భరత్‌పూర్ ఠాణాలో దర్యాప్తు చేపట్టింది. ఠాణా వెలుపల 17వ తేదీ రాత్రి భరత్‌పూర్ ప్రాంతంలో రక్షణశాఖ అధికారి, ఆయన స్నేహితురాలిని వేధించిన ఏడుగురిని విచారించింది. నిజనిర్ధారణ పరీక్షకు న్యాయస్థానం అనుమతించినందున అధికారులు దీనకృష్ణ మిశ్రను గాంధీనగర్‌కు తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

భువనేశ్వర్‌లో జాతీయ టెన్నిస్ పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా టెన్నిస్ సంఘం (ఓటీఏ), అఖిల భారత టెన్నిస్ సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ టెన్నిస్ పోటీలు భువనేశ్వర్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. కళింగ మైదానంలో ఈ నెల 30 వరకు కొనసాగనున్న ఇందులో ఒడిశాతోపాటు పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, అసోం తదితర రాష్ట్రాలకు చెందిన 75 మంది అండర్-14, 16 విభాగాల బాలబాలికలు పోటీపడుతున్నారు. తొలిరోజు వర్షం కారణంగా పలు మ్యాచులు రద్దయ్యాయి. ప్రారంభకార్యక్రమంలో ఓటీఏ అధ్యక్షుడు, ఐఏఎస్ విశ్రాంత అధికారి అశిత్ త్రిపాఠి, సంయుక్త కార్యదర్శి సంజీవ్ పండా, పోటీల నిర్వహణాధికారి సంబిత్ పట్నాయక్, కోశాధికారి సత్యజిత్ మహంతి తదితరులు పాల్గొన్నారు. జాతీయ రిఫరీ జతిన్ బత్స్యా పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



పోటీలకు వచ్చిన వివిధ రాష్ట్రాల క్రీడాకారులు, ఓటీఏ ప్రతినిధులు

పొలంలో కర్షకుడి మృతదేహం లభ్యం




పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన సమితి అడవా ఠాణా పరిధిలోని జాడింగి గ్రామంలోని పంట పొలంలో బుధవారం కర్షకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... కాటమా పంచాయతీ జాడింగి గ్రామానికి చెందిన రబి మాఝి(40) మంగళవారం సాయంత్రం పొలానికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదు. వర్షం పడడంతో ఎక్కడో తలదాచుకుని ఉంటాడనుకున్నారు. బుధవారం ఉదయం స్థానికులు అటుగా వెళ్తూ పొలంలో ఆయన మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పరీక్ష నిమిత్తం బ్రహ్మపుర ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియ రాలేదని, దర్యాప్తు చేస్తున్నామని ఠాణా అధికారి సుబ్రాంత్ కుమార్ పండా తెలిపారు.

తరాతరిణి శక్తిపీఠంలో షోడశోపచార పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం ప్రజల ఆరాధ్య దైవం సుప్రసిద్ధ మా తరాతరిణి శక్తిపీఠంలో మూలాష్టమి సందర్భంగా మంగళవారం రాత్రి షోడశోపచార పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సేవాయత్‌ల కుటుంబ సభ్యులు రుషికుల్యా నది నుంచి పవిత్ర జలాల్ని బిందెలతో తీసుకొచ్చి కొండపై కొలువైన శక్తిపీఠానికి చేరుకున్నారు. అనంతరం శక్తి పీఠం ఆవరణలోని స్నానమండపంలో దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించి, విశేష అర్చనలు చేశారు. అనంతరం కొండపై కొలువైన శక్తిపీఠంలో సేవాయత్‌లు పూజలు చేశారు.



శక్తిపీఠం ఆవరణలోని స్నాన మండపంలో దేవతామూర్తులకు అర్చనలు



కొండపై కొలువైన మా తరాతరిణి

ఆయా వేడుకల్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పదహారు రోజులపాటు నిత్యం ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని సేవాయత్ బాపూజీ రణా విలేకరులకు చెప్పారు.

బగల్ముఖి అవతారంలో విమలాదేవి

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ శబరి శ్రీక్షేత్రంలో 16రోజుల పాటు జరిగే వన దుర్గ పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విమలాదేవిని బగల్ముఖి అవతారంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



ఏనుగుల బీభత్సం.. భయాందోళనలో జనం

రెండుగా విడిపోయిన గజరాజుల గుంపు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమ్‌బెంగాల్ సరిహద్దు నుంచి మన రాష్ట్రంలోకి చొరబడ్డ ఏనుగులు రెండు బృందాలుగా విడిపోయి ఆయా గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. మయూర్‌భంజ్ జిల్లాలోని రెవులి, రాస్‌గోవింద్‌పూర్, బెత్నోటి అటవీ రేంజ్ పరిధిలో బీభత్సం సృష్టిస్తున్న కరిరాజులు ఆయా గ్రామాలకు చెందిన ఇద్దరు మృతికి, మరో ముగ్గురు తీవ్రగాయాలు పాలవడానికి కారణమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అటవీశాఖ అధికారులు, పోలీసులు బాధిత గ్రామాలకు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. మయూర్‌భంజ్ జిల్లాలోకి 50 గజరాజులు చొరబడగా, వీటిలో 28 ఏనుగులు, 22 కరిరాజులు రెండు బృందాలుగా విడిపోయినట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు. అటవీ రేంజ్ అధికారి గణశ్యాం సింగ్ నేతృత్వంలో అటవీ సిబ్బంది, పోలీసులు బాధిత గ్రామాలకు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ఈ విషయమై సింగ్ మాట్లాడుతూ ప్రస్తుతానికి డెంగనలియా అటవీ ప్రాంతంలో 28, శర్ముల అడవుల్లో మరో 22 ఏనుగులు సంచరిస్తున్నట్లు వెల్లడించారు. సమీప అటవీ ప్రాంతాల్లోకి ఎవరూ వెళ్లొద్దని చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందుతుందని సింగ్ పేర్కొన్నారు.



ఉలుదిహా గ్రామంలో దర్యాప్తు చేపడుతున్న పోలీసులు, అటవీ అధికారులు

బిజదలో అసంతృప్తి గళాలు

సర్దుబాటు చర్యల్లో నవీన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద అధికారంలో ఉన్న సమయంలో అధినేత ముందు నిలబడి మాట్లాడే సాహసం పార్టీ నాయకులకుండేది కాదు. అధికారం కోల్పోయిన తరువాత వారు ప్రసార సాధనాల ముందు పరస్పర విమర్శలు, ఆరోపణలు చేసుకుంటున్నారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ అసంతృప్తిపై రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది.

జిల్లాల వారీగా సమీక్షలు

కొద్దిమంది నాయకులు మినహాయిస్తే ఇదివరకు నవీన్ నివాస్‌లో ఇతరులెవరికీ ప్రవేశం ఉండేది కాదు. అధినేతను కలవడం సాధ్యమయ్యేది కాదు. ఇది నిన్నటి పరిస్థితి. బిజద అధికారం కోల్పోయిన తరువాత అన్ని జిల్లాల్లో లుకలుకలు తీవ్రమయ్యాయి. ఇటీవల భువనేశ్వర్ నేతల మధ్య నెలకొన్న విభేదాలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. గంజాం, నవరంగపూర్, కేంఝర్, సంబల్‌పూర్, కటక్ తదితర జిల్లాల్లో నేతల మధ్య గొడవలు రచ్చకెక్కాయి. దీన్ని అదనుగా చేసుకున్న భాజపా నేతలు బిజద అసంతుష్ట నేతల్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. పంచాయతీ, సమితులు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల కౌన్సిలర్లు తదితరుల్లో అవిశ్వాసం కనిపిస్తోంది. బిజదకు చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. మరో నలుగురు సభ్యులు (ఎంపీలు) భాజపాలో చేరతారన్న వార్తలు వినిపిస్తున్నాయి. పరిస్థితి తీవ్రత గమనించిన నవీన్ పట్నాయక్ అన్ని జిల్లాల పార్టీ నాయకుల్ని పిలిపించి మాట్లాడుతున్నారు. సర్దుబాట్లు, దిద్దుబాట్లు చేస్తున్నారు. సహచరులకు దూరంగా ఉండే ఆయన అందరికీ చేరువయ్యే దిశగా అడుగులేస్తున్నారు.

రెండో ప్రత్యామ్నాయం ఏదీ?

బిజదలో జనాకర్షణ ఉన్న నేత నవీన్ ఒక్కరే. ఇతరులెవరికీ రాష్ట్రస్థాయిలో ఆకర్షణ లేదు. అధినేతకు వయోభారం పెరిగింది. అధికారం కోల్పోయిన తరువాత లేని ఉత్సాహం కూడగట్టుకుని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బిజదకు ప్రస్తుతం సరైన వారసుడు లేకపోవడం సమస్యగా పరిణమించింది. ఈ పరిస్థితిలో పార్టీలో నెలకొన్న అసంతృప్తి అధినేతకు శిరోభారంగా మారింది. ప్రసార సాధనాల ముందు నోరుపారేసుకోరాదని ఆయన హెచ్చరిస్తున్నా, కొందరు ఖాతరు చేయడం లేదు.



కటక్ జిల్లా మహిళా ప్రతినిధులతో నవీన్ పట్నాయక్

శాసనసభలోనూ తీసికట్టు

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం హోదాకే పరిమితమైన బిజద శాసనసభలోనూ ఆకట్టుకునేలా వ్యవహరించలేదు. ఇటీవల జరిగిన సమావేశాల్లో సక్రమంగా బాధ్యతలు నిర్వహించలేదని పరిశీలకులన్నారు. నవీన్ మొక్కుబడిగా పాల్గొన్నారు. విపక్ష ఉపనేత ప్రసన్న ఆచార్య అస్వస్థత పేరిట సభా కార్యక్రమాల్లో పాల్గొనలేదు. అనుభవం, సమర్థత ఉన్న నాయకులు సక్రమంగా తమ బాధ్యత నిర్వర్తించలేకపోయారు. బిజద కంటే కాంగ్రెస్ బలంగా ప్రజావాణి వినిపించింది. ఈ పరిణామం బిజద ప్రతిష్ఠను మసకబార్చింది.

నవీన్‌ను కలిసిన కటక్ మహిళలు

మంగళవారం రాత్రి కటక్ జిల్లా బిజద మహిళా విభాగం ప్రతినిధులు నవీన్ నివాస్‌లో అధినేతను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారం కోసం కాకుండా జనం కోసం పనులు చేయాలని, తాను త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని చెప్పారు.

అనుబంధ విభాగాలు నామమాత్రం

బిజదలో ఉన్న వివిధ విభాగాలు నామమాత్రం. అన్నింటికీ కర్త, కర్మ, క్రియ నవీనే. దీంతో ఏ విభాగం చురుకుగా వ్యవహరించలేకపోయింది. సమర్థులున్నా వారు అధినేతపైనే ఆధారపడుతున్నారు. స్వీయ నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. మరోవైపు జిల్లాస్థాయిలో నూతన కార్యవర్గాలు ఏర్పాటవుతాయని ఎన్నికల ముందు నుంచి నాయకత్వం ప్రకటించినా, అది నెరవేరలేదు.

ఆయనపై బాధ్యత ఉంది

రాజకీయ పార్టీలకు అధికారమే పరమావధికారాదని, అధికారంలో ఉన్నా లేకపోయినా రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమం కోసం పోరాడాలని నవీన్‌కు తెలుసు. ఇప్పుడు భాజపా అధికారంలో ఉన్నంత మాత్రన బిజదను జనం విస్మరించలేదు. 25 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన ఘన చరిత్ర గల నవీన్ భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆయనకు, పార్టీకి విధేయులుగా ఉన్న నేతలు అభిప్రాయపడుతున్నారు.

ప్రజల్లోకి రాకపోవడం వల్లే..



పార్టీ అగ్రనేత **బద్రినారాయణ పాత్ర్** మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... బిజద ఎన్నికల్లో పరాజయం పాలైనా ప్రజాదరణ కోల్పోలేదన్నారు. రాజకీయ పార్టీలకు ఉత్థానపతనాలు సహజమని, గత ఎన్నికల్లో నవీన్ క్రియాశీలకంగా వ్యవహరించకపోవడంతో పార్టీ వెనుకంజ వేసిందన్నారు. ఆయన ప్రజల్లోకి వచ్చి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవన్నారు. ఇదంతా గతమని, భవిష్యత్తు గురించి నవీన్ ఆలోచించాలని కోరుతున్నామన్నారు.

వైభవం తథ్యం



మరో అగ్రనేత **ప్రతాప్ దేవ్** విలేకరులతో మాట్లాడుతూ... అధికారదాహం కల కొందరు నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, అలాంటి వారున్నా లేకపోయినా ఒరిగేదేమీ లేదన్నారు. ఇప్పుడే నవీన్ స్వయంగా పరిస్థితి సమీక్షిస్తున్నారు. మళ్లీ వైభవం తథ్యమన్నారు. జనాలతో మమేకమై సేవాభావంతో పనులు చేయాలని పిలుపునిస్తున్నారన్నారు.

జయపురంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో మంగళవారం రాత్రి బహుళ అష్టమి సందర్భంగా దసరా ఉత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. మొదట భగవతి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకించి హోమం నిర్వహించారు. అనంతరం వరుణ్‌పూజ, స్వస్తి వాచకం, పుణ్యాహవచనం, ద్వారపాలక పూజలు నిర్వహించారు. భూతిసాహిలో ఉన్న కనకదుర్గ, సౌరాసాహిలోని బసంతలక్ష్మి, పూర్ణగూడలో గల దక్షిణకాళి, జగజ్జనని ఆలయాల్లో దేవదాయ శాఖ అధికారి సబ్యసాచి జెనా ఆధ్వర్యంలో అర్చకుడు ధీరెన్ రథ్ పూజలు నిర్వహించారు. అనంతరం పురాధ్యక్షుడు నరేంద్రమహంతి ఆలయ అర్చకులకు ఆహ్వాన పత్రిక అందజేశారు. తర్వాత నవరంగపూర్, మల్కాన్‌గిరి జిల్లాల్లోని 72 ఆలయాలకు పత్రికను పంపించి ఆహ్వానిస్తారు.



ఆలయ అర్చకులకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పురాధ్యక్షుడు, తహసీల్దార్

ఖనిజ ఉత్పత్తుల్లో రాష్ట్రం అగ్రగామి: మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఖనిజ ఉత్పత్తుల్లో రాష్ట్రం అగ్రగామి అని, అవినీతి, అక్రమాలు అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో గనులశాఖ సమీక్షా సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ... 55,003 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉక్కు, బాక్సైట్, క్రోమైట్ సంపద దేశంలోనే అత్యధికంగా ఇక్కడ ఉందన్నారు. బొగ్గు, మాంగనీసు ఉత్పత్తిలో రెండోస్థానంలో ఉందని, ఈ సంపద సద్వినియోగం చేసుకుంటామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి గనుల లీజులు కేటాయిస్తామని, ఇదంతా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఉక్కుగనులశాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఉక్కుగనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సురేంద్రకుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మోహన్, మంత్రి బిభూతి, ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు


వైద్య సేవలపై రోగి సహాయకురాలిని ఆరా తీస్తున్న శాలినీ

మునిగుడలో శాలినీ పండిట్ పర్యటన

రాయగడ పట్టణం, మునిగుడ, న్యూస్‌టుడే: జిల్లాలోని మునిగుడలో మిషన్‌శక్తి, స్కూల్ అండ్ మాస్ ఎడ్యుకేషన్ కార్యదర్శి శాలినీ పండిట్ బుధవారం పర్యటించారు. మునిగుడ సామాజిక ఆరోగ్య కేంద్రాని (సీహెచ్‌సీ)కి వెళ్లిన ఆమె ఇక్కడ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది పనితీరు తదితర అంశాలపై రోగుల సహాయకులతో మాట్లాడి ఆరా తీశారు. వార్డులన్నింటినీ పరిశీలించిన ఆమె సీహెచ్‌సీలో వసతుల గురించి విధుల్లో ఉన్న వైద్యురాలిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సమకూర్చుతున్న వసతులు, రోగులకు మందుల పంపిణీ తదితర అంశాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం గోవర్ధన్ వీధిలో స్వయం సహాయక బృందం మహిళలు నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

దీన్‌దయాళ్ జయంతి వేడుకలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండిలో జిల్లా భాజపా కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 108 జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. భాజపా నేతలు ఆయన చిత్రపటం వద్ద దీపం వెలిగించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాది, సిద్ధాంతకర్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు దీనదయాళ్ సేవలు చిరస్మరణీయమన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ మరణాంతరం పార్టీ బాధ్యతలు భుజాన వేసుకొని విజయపథంలో నడిపించిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిత్రీ సింహాద్రి, సాధారణ కార్యదర్శి జగన్నాథ్ మహాపాత్ర్, ప్రశాంత్, నర్సింగ్ చరణ్ పట్నాయక్, దారపు రాజేష్, కృష్ణచంద్ర బిశోయ్, పిన్నింటి కిరణ్, రఘు, లక్ష్మణ్ పాల్గొన్నారు.


దీనదయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నేతలు


మహిళకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కడం

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం అన్నారు. జిల్లా సామాజిక భద్రత విభాగం ఆధ్వర్యంలో నందపూర్ సమితి కేంద్రంలో బుధవారం దివ్యాంగుల గుర్తింపు శిబిరం, కొత్త పింఛన్లు అందజేత కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడం పాల్గొని ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. 24 పంచాయతీలకు చెందిన దివ్యాంగులు పేర్లు నమోదు చేసుకున్నారు. దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసి, గుర్తింపు పత్రాలు అందజేశారు. అనంతరం చక్రాల కుర్చీ, చేతి కర్ర, వినికిడి యంత్రం తదితరాలు అందజేశారు. 193 మందికి పింఛన్లు అందజేశారు.

ఆసియా రగ్బీ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు


చరణ్ హేంబ్రమ్ | భరత్‌కిషన్ | బిద్యాధర్ మాఝి | ప్రదీప్ కన్హర్ | బసి ఓరామ్ | మీనాక్షి మాఝి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: మలేషియాలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న అండర్-18 బాలబాలికల ఆసియా రగ్బీ పోటీలకు భారత జట్టు సిద్ధమైంది. ఇందులో రాష్ట్రానికి చెందిన చరణ్ హేంబ్రమ్, భరత్ కిషన్, బిద్యాధర్ మాఝి, ప్రదీప్ కన్హర్, బసి ఓరామ్, మీనాక్షి మాఝి చోటు దక్కించుకున్నారు.


బహుమతితో గంజాం బాలబాలికలు, సంఘం ప్రతినిధులు

రాష్ట్ర ఖోఖోలో గంజాంకు ద్వితీయస్థానం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: పూరీలో మంగళవారం జరిగిన 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల ఖోఖో పోటీల్లో గంజాం బాలబాలికలు జట్లు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బుధవారం నగరానికి చేరుకున్న జట్ల బాలలకు రైల్వే స్టేషన్‌లో జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ప్రతినిధులు పుష్పగుచ్ఛాలందజేసి అభినందనలు తెలిపారు. పోటీల తుదిపోరులో గంజాం బాలికలు భువనేశ్వర్ కిట్ జట్టు చేతిలో ఓటమి పాలై ద్వితీయస్థానంలో నిలవగా, బాలుర విభాగంలో పూరీ జట్టు చేతిలో ఓడి రెండో స్థానంలో నిలిచింది.

జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పాఠశాలల క్రీడలు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్ పోటీలు జరిగాయి. బ్రహ్మపురలోని మహాత్మాగాంధీ మైదానంలో నిర్వహించిన పోటీల్లో 40 పాఠశాలలకు చెందిన 400 మంది బాలబాలికలు పాల్గొన్నారు. గంజాం వెయిట్‌లిఫ్టింగ్ అకాడమీ ఇండోర్‌హాల్, బాస్కెట్‌బాల్ కోర్టు, మైదానం ప్రాంగణంలోని బాక్సింగ్ రింగ్‌లో జరిపిన ఆయా అంశాలను జిల్లా క్రీడాధికారి సుశాంతకుమార్ సాహు, జిల్లా విద్యాధికారి అమితా పట్నాయక్ అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఉత్తమ బాలబాలికల జట్లను ఎంపిక చేసి గంజాం పాఠశాలల జట్లుగా రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సిమిలిగుడ అభివృద్ధిపై దృష్టి సారించాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ సమితి అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడంను ఆయన నివాసంలో కలిశారు. సమస్యలు, అభివృద్ధి పనులు తదితరాలపై చర్చించారు. సిమిలిగుడ సమితిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. సహకారం అందిస్తానని, ప్రత్యేక దృష్టి నిలుపుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. సమితి అధ్యక్షురాలు లిల్లీ అంత బిరియా తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో ప్రజా ప్రతినిధులు

డిమాండ్లు పరిష్కరించాలంటూ ధర్నా


సమితి కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సంఘం మహిళలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాయగడ సమితి గ్రామ పంచాయతీల స్థాయి కార్మిక సమాఖ్య సంఘం సభ్యులు ధర్నాకు దిగారు. 28 గ్రామ పంచాయతీలకు చెందిన మహిళలు బుధవారం సమితి కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. పంచాయతీ స్థాయిలో బ్యాంకు మిత్ర, ఎంబీకే, సీఆర్‌పీ, ప్రాణిమిత్ర, కృషిమిత్ర కేడర్ల కింది సేవలందిస్తున్న తాము పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గతంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడాకు వినతిపత్రం అందజేశామని, పరిష్కారం కాలేదన్నారు. అందువల్ల బుధవారం విధులు బహిష్కరించినట్లు తెలిపారు. డిమాండ్లు పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమితి అభివృద్ధి అధికారి అమూల్యకుమార్ సాహుకు అందజేశారు. సంఘం అధ్యక్షురాలు రంభ తాడింగి, కార్యదర్శి సుమిత్ర తురుక్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి ఆందోళన

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ప్రధానమైన పది డిమాండ్ల నెరవేర్పును కోరుతూ ఒడిశా నర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బ్రహ్మపురలోని ఎమ్మెస్సీబీ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఆందోళన నిర్వహించారు. దీనితో అత్యవసర వైద్య సేవలు మినహా మిగతా సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


బ్రహ్మపురలో..

పర్లాఖెముండిలో..


పర్లాఖెముండిలో నిరసన తెలుపుతున్న నర్సులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: నర్సులకు ఉద్యోగోన్నతి కల్పించాలంటూ ఒడిశా నర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్లకార్డులతో బుధవారం జిల్లా ప్రధాన ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేసింది. నర్సులను ఆరేళ్ల తర్వాత సీనియర్లుగా గుర్తించి ఉద్యోగోన్నతి కల్పించాలని, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా నియమించాలని తదితర పది డిమాండ్లు పరిష్కరించాలని నర్సులు కోరారు.

బడిలో వసతులు కరవు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపడహండి సమితి మైదల్‌పూర్ పంచాయతీ నిగిగూడ గ్రామంలో పాఠశాలలో వసతులు కరవయ్యాయి. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం పాఠశాల వద్ద ఆందోళన చేశారు. 64 మంది విద్యార్థులు చదువుతున్న ఈ బడిలో పైకప్పుపై ఉన్న రేకులు విరిగిపోయాయి. మరుగుదొడ్డి, తాగునీటి సదుపాయం లేదు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. బీఈవో దేవీ ప్రసాద్ పాత్రకు అడుగగా త్వరలో మరమ్మతులు చేపిస్తామని తెలిపారు.


పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

ముసుగు తొలగించరు.. బోర్డు మార్చరు.!



రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పాత ప్రభుత్వానికి చెందిన బోర్డులు తొలగించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదేశాలు జారీ చేశారు. మూడు నెలలు దాటినా వాటిని తొలగించలేదు. రాయగడ సమితి కార్యాలయం సమీపంలో ఒడిశా వ్యవసాయ పరిశ్రమ మేనేజర్ కార్యాలయం వద్ద గత ప్రభుత్వానికి చెందిన ఓ బ్యానరు ముసుగు కప్పి కనిపించడమే ఇందుకు ఉదాహరణ. దీంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

–న్యూస్‌టుడే, రాయగడ

మజ్జిగన్నం ఆరగించిన ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి బుధవారం మధ్యాహ్నం భువనేశ్వర్‌లోని పుఖరిపుట్ ప్రాంతంలో పర్యటించారు. భాజపా కార్యకర్త బిశ్వనాథ్ శెఠి ఆప్యాయంగా పిలవడంతో ఆయన ఇంటికి వెళ్లి మజ్జిగన్నం ఆరగించారు.

–న్యూస్‌టుడే, భువనేశ్వర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం కాలియాగావ్ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. సదరు సమితి మాలి దొలాయిపుట్ గ్రామానికి చెందిన సంతోష్ హరిజన్ (22) బుధవారం ద్విచక్ర వాహనంపై జయపురానికి వస్తుండగా, కాలియాగావ్ చౌక్ వద్ద వాహనం అదుపుతప్పడంతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టాడు. ఆయనను స్థానికులు జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పరీక్ష అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉపముఖ్యమంత్రి కాన్వాయ్‌లో ఇద్దరికి గాయాలు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ బుధవారం సాయంత్రం పూరీ జిల్లాలోని తన సొంత నియోజకవర్గం నిమపడకు వెళ్తుండగా వాహనాల కాన్వాయ్‌లోని వాహనం తగిలి ఇద్దరు యువకులు గాయపడ్డారు. మంత్రి స్వయంగా అదే పోలీసు వాహనంలో క్షతగాత్రులను భువనేశ్వర్ సమ్ ఆసుపత్రికి చికిత్సకు పంపించారు.

నమ్మించి దోచుకున్నారు

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఇళ్లు నిర్మిస్తామని నమ్మించి డబ్బులు దోచుకున్న ఘటన నవరంగపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. 15 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నవరంగపూర్ జిల్లా టెంటులిఖుంటి సమితి దిగి పంచాయతీకి చెందిన రజనీకాంత్ మహంతి, భగవాన్ పాఢి, సొల్పా గ్రామానికి చెందిన బైది జానీ పీఎం ఆవాస్ యోజనలో భాగంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఆ పనులు కొందరి కార్మికులకు అప్పగించగా, వారు తమ బ్యాంక్ ఖాతా వివరాలివ్వండని, వాటిని కార్మిక కార్యాలయంలో అందజేస్తే తమకు డబ్బులు వస్తాయని చెప్పి నమ్మించారు. బ్యాంకు ఖాతా వివరాలివ్వగా, కొన్ని రోజులు పని చేసి ఖాతాలోని సొమ్ము తీసుకుని పరారయ్యారు. విషయం గ్రామీణ రోజ్‌గర్ సేవకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. బుధవారం బీడీవో మనోజ్ కుమార్ పాణిగ్రహికి ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

హత్య కేసు నిందితుల అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర సదర్ ఠాణా పరిధిలోని లంజియా గ్రామానికి చెందిన శిబాశీష్ చౌధురి అలియాస్ శిబ (24) అనే యువకుడ్ని కొందరు హతమార్చి, మృతదేహన్ని డెంగాపదర్ కూడలిలోని చెరువులో పడేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేసి ఓ కత్తి, చాకు, మూడు ద్విచక్ర వాహనాలు తదితరాలు స్వాధీనం చేసుకున్నామని అదనపు ఎస్పీ రమేష్‌చంద్ర సెఠి రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వీరిని మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం నువాసాహిలో బుధవారం ఎదురుగా వస్తున్న సైకిల్‌ను తప్పించబోయి ఓ కారు కాలువలోకి దూసుకెళ్లింది. ఘటనలో ఏ ప్రమాదం జరగలేదు. కారులో ఇద్దరు హన్నగూడ నుంచి నువాసాహికి వెళ్తుండగా బిజు వెండింగ్ జోన్ సమీపంలో ఘటన జరిగింది. స్థానికులు సాయంతో ఇద్దరు బయటపడ్డారు.

నిందితునికి పదేళ్ల జైలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ పుఖరిపుట్ ప్రాంతానికి చెందిన రమేష్ జెనా అనే వ్యక్తి 2022లో ఒక దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో భువనేశ్వర్ ఏడీజేఎం న్యాయస్థానం బుధవారం పదేళ్ల జైలు శిక్ష విధించింది.

★ భువనేశ్వర్: రవుర్కెలా పోలీసు జిల్లా పరిధిలోని బొంధోముండ ఠాణా ఐఐసీ అశోక్‌దాస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఒక మహిళా కానిస్టేబుల్‌పై అత్యాచార యత్నం చేసినట్లు రవుర్కెలా ఎస్పీ బ్రిజేష్ రాయ్ దృష్టికొచ్చింది. బుధవారం బాధితురాలు దీనిపై లిఖితపూర్వకంగా తెలియజేసింది.

★ పర్లాఖెముండి: అడవా ఠాణా పరిధిలోని రాయిపొంక గ్రామ ప్రాంతంలో 2020లో గ్రానైట్ వాహనంలో 2013 కిలోల గంజాయి రవాణా చేస్తూ ఇద్దరు పట్టుబడ్డారు. ఈ కేసుకు సంబంధించి నిందితులు రవి, రాములకు 12 ఏళ్ల జైలుశిక్ష, లక్ష చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


కొరాపుట్‌లో..


పర్లాఖెముండిలో ఎం. సుధారాణి, సభ్యులు

కొరాపుట్, సిమిలిగుడ, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు, పలువురు ప్రముఖులు పాల్గొని పాఠశాలలు, కళాశాలల ప్రాంగణంలోని చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు. మురుగు కాల్వలు, రహదారులు శుభ్రపరిచారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందని ప్రజలకు చైతన్యం కలిగించారు.



పెరుగుతున్న కూరగాయల ధరలు



ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మార్కెట్లో కూరగాయల ధరలు మండుతున్నాయి. పశ్చిమ, తూర్పు మిడ్నాపూర్, ఝార్‌గ్రామ్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఇటీవల వరదలు రావడంతో కూరగాయల పంటలు దెబ్బ తిన్నాయి. దీంతో ధరలు అమాంతం పెరిగాయి. వంకాయలు, బీరకాయలు, బెండ తదితరాలు కిలో రూ.60 నుంచి రూ.80కు విక్రయిస్తున్నారు. సామాన్యులు ఆ ధరలకు కొనలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం దీనికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సుభద్ర సొమ్ము కోసం 92 లక్షల దరఖాస్తులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుభద్ర పథకం కింద ఇంత వరకు 92 లక్షల మంది మహిళలు దరఖాస్తు చేసినట్లు ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ చెప్పారు. బుధవారం భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... తొలి విడతలో 25 లక్షల 11 వేల మందికి సొమ్ము చెల్లింపులు జరిగాయన్నారు. వారం రోజుల్లోగా మరో 25 లక్షల మంది బ్యాంకు ఖాతాలకు డీబీటీ మాధ్యమంలో జమ చేయనున్నామన్నారు. కేవైసీ పరిశీలన జరుగుతుండడంతో ఒకేసారి అందరికీ చెల్లింపులు చేయలేకపోతున్నామని, స్వల్ప ఆలస్యం జరుగుతోందన్నారు. మార్చి 8న (మహిళా దినోత్సవం) రెండో దశ సొమ్ము చెల్లింపులకు ఇబ్బందులుండవని, ఒకేసారి అందరి ఖాతాల్లో జమ అవుతుందన్నారు.

బలహీన పడిన అల్పపీడనం

గోపాలపూర్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల మధ్య అల్పపీడనం బలహీన పడి పశ్చిమ ఉత్తర దిశకు తరలినట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం అధికారి కె.ఎస్.మూర్తి బుధవారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. గడిచిన 24 గంటల్లో బాలేశ్వర్‌లో అత్యధిక వర్షపాతం 10 సెంటీమీటర్లు నమోదు కాగా, ఉత్తర ఒడిశా ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయన్నారు. గురువారం బాలేశ్వర్, భద్రక్, మయూర్‌భంజ్, కేంఝర్, సుందర్‌గఢ్ జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉన్నందున 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశామన్నారు.

అందర్నీ ముచ్చెమటలు పోయిస్తున్న గిరిజనుడు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సుందర్‌గఢ్ జిల్లా మహులుపడ ఠాణా పరిధిలోని బొడొజొలా గ్రామానికి చెందిన గిరిజన యువకుడొకరు ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆక్రమించుకొని ఎవరైనా సమీపంలోకి వెళితే బాణాలు వేస్తూ హడలెత్తిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ఆయనను అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించిన ఠాణా ఐఐసీ సురేష్ ప్రధాన్‌పై బాణం వేశాడు. ఆయన గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ యువకుడ్ని అదుపులోకి తీసుకోవడానికి పోలీసు యంత్రాంగం రెండు ప్లటూన్ల బలగాలను నియమించినా బుధవారం మధ్యాహ్నం వరకు చిక్కలేదు. ఆయన ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నాడు.

అవీ.. ఇవీ.. అన్నీ

★ భువనేశ్వర్: కొద్ది రోజుల్లో బిజద నుంచి పెద్ద సంఖ్యలో భాజపాలోకి వలసలు ప్రారంభం అవుతాయని, ఆ పార్టీ అగ్రనేతలు కొందరు పార్టీ మరబోతున్నారని కొంధమాల్ ఎంపీ సుకాంత పాణిగ్రహి చెప్పారు. బుధవారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వారంతా భాజపా కేంద్రనాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు.

★ నవరంగపూర్: నవరంగపూర్ జిల్లా బాలికల వసతి గృహాల మహిళా వార్డెన్ల సంఘ అధ్యక్షురాలు నందిని సాహూ నేతృత్వంలో బుధవారం విద్యాశాఖ మంత్రి నిత్యానంద్ గండ్‌కు ఐదు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. 8 గంటల పని వేళలు, పాఠశాల సమీపంలో తమకి ఇళ్లు, విద్యార్థినుల రక్షణ కోసం వాచ్‌మెన్ నియామకం, జీతాలు పెంచాలని అందులో పేర్కొన్నారు.

★ పర్లాఖెముండి: పర్లాఖెముండిలోని గజపతి క్రీడా మైదానంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 6 నుంచి 9వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. పాలనాధికారి బిజయ్ కుమార్ దాస్, జిల్లా విద్యాధికారి మాయాధర్ సాహు, జడ్పీ కార్య నిర్వహణ అధికారి గుణనిధి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

★ పర్లాఖెముండి: పర్లాఖెముండి పరిధిలో గోశాల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భూమిని కేటాయించాలని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ కార్యకర్తలు బుధవారం తహసీల్దార్ పేరిట రాసిన వినతిపత్రం అదనపు తహసీల్దార్ బి.అలేయ రెడ్డికి అందజేశారు. వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకనాథ్ మిశ్రా, జిల్లా కార్యదర్శి గిన్ని కూర్మ రెడ్డి, కైలాష్ పట్నాయక్, భజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షుడు రబిన్ కుమార్ సాహుకారి, బిభూతి భూషణ్ పాల్గొన్నారు.

★ కొరాపుట్: జిల్లా కేంద్రంలోని లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాల ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డులో మూషికాల బెడద వెంటాడుతోంది. దీంతో నవజాత శిశువులు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులకు ఇచ్చే ఆహారం, మందులు పాడు చేస్తున్నాయి. చిన్నారులను కరుస్తున్నాయని పలువురు చెప్తున్నారు.

★ రాయగడ: ప్రపంచ ఫార్మసీ దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ విశ్వ విద్యాలయం వారు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ రెండో కమాండెంట్ ప్రభాకర్ ఉపాధ్యాయ, వర్సిటీ ప్రాంతీయ సంచాలకుడు రాజేష్ పాఢి జెండా ఊపి ప్రారంభించారు.

భువనేశ్వర్: పరదీప్, కటక్‌లలో ఈ-వాహనాల బ్యాటరీ తయారీ పరిశ్రమల నిర్మాణం నుంచి తప్పుకోలేదని జేఎస్‌డబ్ల్యూ గ్రూపు ఉపాధ్యక్షుడు రంజన్‌నాయక్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం స్థలం సమకూర్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

★ బ్రహ్మపుర నగరం: చెట్లను కాపాడి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని బ్రహ్మపుర సబుజ వాహిని ప్రతినిధులు ముఖ్యమంత్రి మోహన చరణ్ మాఝికి విన్నవించారు. భువనేశ్వర్‌లో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఆయనకు వారంతా ఈ మేరకు వినతిపత్రం అందించారు.

★ భువనేశ్వర్: జీతాలు, దసరా బోనస్ చెల్లించాలన్న డిమాండ్లతో రెండు రోజులుగా సమ్మె చేసిన భువనేశ్వర్ కేపిటల్ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు, బుధవారం సాయంత్రం విధుల్లో చేరారు.

★ బ్రహ్మపుర నగరం: భాజపా బ్రహ్మపుర అసెంబ్లీ నియోజకవర్గం ఆధ్వర్యంలో పండిత దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ జయంత్యుత్సవాల సందర్భంగా బుధవారం గాంధీనగర్‌లో గల బ్రహ్మపుర ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో బ్రహ్మపుర శాసనసభ్యుడు కె.అనిల్ కుమార్, పలువురు భాజపా నాయకులు పాల్గొని ఉపాధ్యాయ్ జీవితం, ఆయన ఆదర్శాలపై మాట్లాడారు.

★ బ్రహ్మపుర నగరం: 'ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్' ప్రోత్సాహంతో బ్రహ్మపురలో బుధవారం ఒకే రోజు రెండు నేత్రదానాలు జరిగాయి. శ్రీకాకుళం జిల్లా కవిటి గ్రామానికి చెందిన కిల్లంశెట్టి ధనలక్ష్మీ (74) బ్రహ్మపుర గాంధీనగర్ రెండోలైనులోని సోదరుడి ఇంట్లో బుధవారం వేకువన కన్నుమూశారు. శాస్త్రినగర్ మూడోలైనుకు చెందిన వడ్డి రజనీ (79) కూడా బుధవారం వేకువన తుదిశ్వాస విడిచారు. వీరి కుటుంబ సభ్యులు ఇద్దరి రెటీనాలను దానం చేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కొత్తవలస, న్యూస్‌టుడే: కంటకాపల్లి శారద పరిశ్రమ బొగ్గుయార్డు బొగ్గులో ఈ నెల 22న వెలుగుచూసిన మృతదేహం ఆచూకీ లభ్యమైందని కొత్తవలస సీఐ సీహెచ్.షణ్ముఖరావు బుధవారం వెల్లడించారు. సీఐ వివరాల ప్రకారం.. మృతుడు ఒడిశా రాష్ట్రం బలిచంద్రపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని సౌడియా గ్రామానికి చెందిన సంబునాద్ పరిడియా(40)గా గుర్తించారు. కటక్ నుంచి ఆరు లారీల్లో పరిశ్రమకు బొగ్గు వచ్చినట్లు తేలడంతో.. బొగ్గు సరఫరా చేస్తున్న శ్రీగణపతి ట్రేడర్స్ బొగ్గుయార్డు వద్ద ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఇక్కడకు వచ్చిన ఓ లారీలోకి ఒక వ్యక్తి సంచి పట్టుకొని ఎక్కి కూర్చొని.. చెయ్యి ఊపుతూ, నమస్కరించిన దృశ్యాలు ఉన్నాయి. మృతదేహంపై ఉన్న దుస్తుల్లో ఒడిశాలోని బాధచ్చానా సీహెచ్‌సీ ఓపీ చీటీ లభ్యమవడంతో.. మృతుని బంధువులకు సమాచారం ఇచ్చారు. అతడి తల్లి రుక్మిణి పరిడియా, అక్క రుస్మిత, బంధువు సురేంద్ర కటక్‌లోని బొగ్గుయార్డుకు వెళ్లి రికార్డయిన దృశ్యాలు చూసి.. సంబునాద్‌గా నిర్ధారించారు. ఎస్.కోట ప్రాంతీయాసుపత్రి శవాగారానికి వచ్చి మృతదేహాన్ని గుర్తు పట్టారని సీఐ వివరించారు. అతనికి మతిస్థిమితం లేక లారీ ఎక్కాడని, దీన్ని గమనించకుండా బొగ్గు లోడ్ చేయడం వల్ల గానీ, మరే ఇతర కారణంవల్లనైనా.. మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించండి


గుత్తేదారులతో మాట్లాడుతున్న కమిషనర్ మిశ్ర

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పుర పాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలోని వివిధ చోట్ల చేపడుతున్న అభివృద్ధి పనులు చేస్తున్న తమకు అందాల్సిన మొత్తాలు మంజూరు చేస్తేనే ఇతర పనులు ప్రారంభించేందుకు వీలవుతుందని పలువురు గుత్తేదారులు అంటున్నారు. వివిధ వార్డులలో పనులు పూర్తయినా వాటి బిల్లులు నిలిపివేసి కొత్త పనులు చేయడం ఎలా సాధ్యమని వారు ప్రశ్నించారు. బుధవారం వీరంతా బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి, కమిషనర్ భవానీప్రసాద్ మిశ్రలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

తెగుళ్లు, దోమల నియంత్రణపై దృష్టి సారించాలి


తుమరాడలో వరి పంటలో తెగుళ్లను పరిశీలిస్తున్న ఏవో శ్రావణ్‌కుమార్

బలిజిపేట, న్యూస్‌టుడే: వరి పంటలో పొడతెగులు, సుడి దోమల నియంత్రణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఎం.శ్రావణ్‌కుమార్ రైతులను కోరారు. తుమరాడలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పంట పొలాలకు వెళ్లి వరి పంటకు సోకిన తెగుళ్లు, దోమల వల్ల పంటకు కలిగే నష్టం గురించి ఆయన వరి ఆకులను పరిశీలించి సూచనలిచ్చారు. తెగుళ్ల నివారణకు రైతులు ఎకరానికి 20-30 కేజీల పొటాష్ వేయాలని, నాణ్యమైన దిగుబడి గింజ బరువు వస్తుందన్నారు. పీడ తెగులు, దోమ ఉధృతి నిర్మూలనకు హెక్సాకొనజోల్ 400 మి.లీ. ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. దోమల నివారణకు ఏసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 90-120 మి.లీ. పిచికారీ చేయాలన్నారు. పశు సంవర్ధక శాఖ, వ్యవసాయశాఖ సహాయకులు, ఉప సర్పంచి మూడడ్ల శివున్నాయుడు, మరడ రాజు పాల్గొన్నారు.

ఒడిశా లారీ అసోసియేషన్ శ్రమదానం


కొమరాడలో గోతులు పూడ్చుతున్న ఒడిశా లారీ అసోసియేషన్, సీపీఎం నాయకులు

కొమరాడ, న్యూస్‌టుడే: పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే ప్రధాన రహదారిలోని గోతులను ఒడిశా లారీ అసోసియేషన్ శ్రమదానంతో బుధవారం కొంత మేరకు పూడ్చింది. ఒడిశాకు వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని గమనించి కొమరాడ వద్ద పడిన గోతులను సంఘ సభ్యులు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో జేసీబీతో తాత్కాలిక పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో రహదారుల మరమ్మతులకు రూ.11 కోట్లు మంజూరైనట్లు ప్రకటనలు చేస్తున్నా.. పనుల్లో కదలిక లేదని ఆరోపించారు. గుంతలను పూడ్చి రహదారి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యంగా

జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్


జనజాతీయ ఉన్నతగ్రామ్ అభియాన్‌పై చర్చిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ్

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలుచేయనున్న ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కింద జిల్లాలో గిరిజన ప్రాంత అవసరాలను గుర్తించి ప్రణాళికను రూపొందించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి జయ జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలతో దూరదృశ్య శ్రవణ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టరు ఐటీడీఏ యంత్రాంగానికి దీనిపై సూచనలు చేశారు. గిరిజన గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి సమగ్ర వివరాలతో ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర అధికారులు సూచించారని పేర్కొన్నారు.

రసాయనాల వినియోగం.. తేనెటీగలకు హానికరం

జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు


తేనెటీగలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఈనాడు, ఏలూరు: పంటలపై పిచికారీ చేసే క్రిమిసంహారక రసాయనాలతో తేనెటీగలకు ముప్పు వాటిల్లుతోందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. ఇటీవల జర్మనీలోని బవేరియాలో బయోసెంటర్ ఆఫ్ జూలియస్-మాక్సీ మిలియన్స్ వర్సిటీలో జరిగిన అధ్యయనాల్లో ఈ విషయం తెలిసింది. రసాయనాలతో తేనెటీగలు చనిపోవటం, దిగుబడి తగ్గడంతో పెంపకందారులు నష్టాలు చవిచూస్తారని పరిశోధకులు స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా విజయరాయిలోని తేనెటీగల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మోహన్‌రావు ఈ పరిశోధన వివరాలను విశ్లేషించారు.

పుప్పొడి, మకరందం కలుషితం..

వ్యవసాయంలో రసాయనాల వాడకం మితిమీరింది. దిగుబడి పెంపు, క్రిమికీటకాల నియంత్రణకు రైతులు ఎక్కువగా మందులు వేస్తున్నారు. పొద్దు తిరుగుడు, నువ్వులు, ఆవాలు, పత్తి, కొబ్బరి, జీడి, మామిడి, నిమ్మ, కర్బూజా మొక్కల్లో మకరందం ఎక్కువగా ఉంటుంది. పురుగు మందులు పిచికారీ చేస్తే పుప్పొడి, మకరందం కలుషితం అవుతాయి. వీటిపై తేనెటీగలు వాలి మకరందం సేకరిస్తే విష ప్రభావంతో చనిపోతాయి.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

ఆంధ్రప్రదేశ్‌లో 5 వేల మంది తేనెటీగలు పెంచుతున్నారు. ఒక్కొక్కరు సగటున 100 పట్టులు నిర్వహిస్తుండగా, ఒక్కోదానికి ఏడాదికి 20 కిలోల చొప్పున మొత్తం 20 క్వింటాలు వరకు తేనె ఉత్పత్తి అవుతోంది. ఒక్కో పట్టులో 60వేల తేనెటీగలు ఉంటాయి. వీటిలో సగం ఆహార సేకరణకు వెళుతూ..రోజుకు 100 వరకు చనిపోతాయి. రసాయనాల ప్రభావంతో వీటి సంఖ్య 600-1000 వరకు ఉంటోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆర్గానోఫాస్పేట్, కార్బమేట్స్, సింథటిక్ పైరత్రాయిడ్స్, ఇన్‌సెక్ట్ గ్రోత్ రెగ్యులేటర్స్ వంటి పురుగు మందుల వినియోగంతో చనిపోతున్నట్లు గుర్తించారు. ఒక పట్టులో 30 వేల తేనెటీగలు చనిపోతే ఏడాదికి వెయ్యి కిలోల తేనె దిగుబడి తగ్గిపోయినట్టే!

జాగ్రత్తలతో నివారించవచ్చు

విషపూరిత పురుగు మందులు పిచికారీ చేసే పొలాలు, తోటల్లో తేనెపట్టులు పెట్టకూడదు. పుష్పించే దశలో తేనెటీగలు ఆకర్షిస్తాయి. ఉదయం, మధ్యాహ్న వేళల్లో మకరందం సేకరణకు వెళతాయి. సాయంత్రం పిచికారీ చేస్తే ఆ ప్రభావం ఈగలపై ఉండదు. గాలిలో పిచికారీ చేసినా ఈగలు చనిపోతాయి. మొక్కల మొదళ్లు, నేలలో వేసే గుళికలు, తక్కువ ప్రభావం ఉన్న పురుగు మందులు ఉపయోగించేలా రైతులకు పెంపకందారులు తెలియజేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పురుగు మందుల పిచికారీ సమాచారం ముందుగా చెబితే పెంపకందారులు జాగ్రత్తలు తీసుకునే వీలుంటుందని, పరస్పర సహకారంతో తేనెటీగలను కాపాడు కోవచ్చని చెబుతున్నారు.

ఆర్టీసీ నిలయం.. అడుగెట్టలేం



పాలకొండ ఆర్టీసీ బస్సు నిలయానికి వెళ్తే పాట్లు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాంగణంలో నీరు నిలిచి మురుగు కూపంలా మారింది. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. బయటకు మళ్లించేలా చూస్తామని డిపో మేనేజరు వెంకటేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మహాలక్ష్మి హత్య కేసులో నిందితుని ఆత్మహత్య

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బెంగళూరులో మహాలక్ష్మి హత్యకేసులో నిందితుడు ముక్తిరంజన్ ప్రతాప్ రాయ్ ఆత్మహత్య చేసుకున్నట్లు భద్రక్ ఎస్పీ వరుణ్ గుంటుపల్లి బుధవారం రాత్రి తెలిపారు. భద్రక్ జిల్లాలోని దుసిరి ఠాణా పరిధిలోని కులైపడ గ్రామ శ్మశానంలో ఆత్మహత్య చేసుకున్న ప్రతాప్ రాయ్ మృతదేహాన్ని గుర్తించామని, అక్కడ సూసైడ్ నోట్ లభించిందని చెప్పారు. ఇందులో తాను మహాలక్ష్మిని హత్య చేసి 59 ముక్కలుగా చేసి ఫ్రిడ్జ్‌లో దాచినట్లు రాసి ఉందన్నారు. అనంతరం తాను ఒడిశాకు పరారై వచ్చినట్లు సూసైడ్ నోట్‌లో ఉందని చెప్పారు.

బాలికపై సామూహిక అత్యాచారం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఓ మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన సుందర్‌గఢ్ జిల్లా రవుర్కెలాలో చోటుచేసుకుంది. బుధవారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి రవుర్కెలా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాధిత బాలిక తన ఇద్దరు స్నేహితులతో కలసి ఆదివారం రాత్రి ఓ రెస్టారెంట్‌కు వెళ్లింది. అక్కడ బాలికకు మాయమాటలు చెప్పిన నిందితులు ఆమెను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఆ తర్వాత మరో ముగ్గురు నిందితులు బాధితురాలిని శారీరకంగా వేధించారు. దీనిపై రవుర్కెలా ఎస్పీ బ్రిజేష్ కుమార్ రోయ్ మాట్లాడుతూ అదనపు ఎస్పీ నేతృత్వంలో పోలీసు బృందం దర్యాప్తు ప్రారంభించిందని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని చెప్పారు. వారం రోజుల వ్యవధిలో జిల్లాలో ఇలాంటి మూడు ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. రెండు రోజుల క్రితం ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచార ఘటన మరువక ముందే ఇలాంటి ఘటన పునరావృతం కావడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు.

నాణ్యమైన విత్తనాలతో దిగుబడి

పాచిపెంట, న్యూస్‌టుడే: నాణ్యమైన విత్తనాల వాడకంతో పంట దిగుబడి సాధించొచ్చని సాలూరు ఏడీఏ మధుసూదనరావు తెలిపారు. మండలంలోని పిండ్రింగివలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలతో మూడేళ్ల వరకు అధిక దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువుల వాడకంతో పంట పెట్టుబడి పెరిగి, భూసారం కోల్పోతుందని వివరించారు.

పిడుగుపాటుతో ఒకరి మృతి

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పిడుగుపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారానికి చెందిన కుమ్మరి అశోక్ వద్ద ఒడిశా రాష్ట్రం నవాపాడ జిల్లా గోడల్ గ్రామానికి చెందిన జాటి పటేల్(36) మూడు నెలలుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. 24వ తేదీన ఆయన గేదెలు మేపడానికి పంట చేనుకు వెళ్లారు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. బుధవారం ఉదయం వెళ్లి చూడగా డంప్ యార్డు వద్ద విగత జీవిగా పడి ఉన్నాడు. పిడుగుపాటుతో మృతిచెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతేరాజు

వర్షాకాలంలో అరటిలో సస్యరక్షణ



గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే

ఉద్యాన పంటల్లో మొక్క దశ నుంచి సరైన యాజమాన్య పద్ధతులతో పాటు ఎరువులను క్రమపద్ధతిలో వేస్తే మొక్కలు ఏపుగా పెరుగుతాయని కేవీకే శాస్త్రవేత్త **శ్రీనివాసరాజు** తెలిపారు. రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.

ఎరువుల యాజమాన్యం.. పంటలకు జీవం

? అరటిలో యాజమాన్య తెగులు గురించి తెలుపగలరు.

- సన్యాసిరావు, కుదమ

☛ అరటిలో కర్పూర, చక్కర కేళీ రకానికి నత్రజని, పొటాష్ నాలుగు మోతాదులుగా 50 గ్రాముల నత్రజని, 50 గ్రాముల పొటాషియం కలిపి పిలక నాటిన తరువాత 45, 90, 135, 180 రోజులకు వేసుకోవాలి. తెగుళ్లు సోకుండా సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చు.

? బొప్పాయిలో వైరస్ తెగుళ్ల నుంచి నివారణ ఎలా..?

- శ్రీనివాసరావు, రామభద్రపురం

☛ బొప్పాయిలో ఆకుముడత, రింగ్స్ పాట్ వైరస్ తెగులు ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి. బొప్పాయి నారును రసం పీల్చే పురుగులు చొరబడని 40 నుంచి 60 సైజు కలిగిన నైలాన్ మెస్నెట్ హౌస్లలో పెంచాలి. ఈ పురుగు ఆశించే వంగ, గుమ్మడి జాతి పంటలను పొలం సమీపంలో పెంచకూడదు. తోట చుట్టూ మొక్కలు నాటే 15 రోజులు ముందు అవిస రెండు వరుసలు, మొక్కజొన్న లేదా జొన్న రెండు వరుసలు రక్షణ పంటలుగా వేసుకుంటే లాభం ఉంటుంది.



వర్షాకాలంలో అరటి రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చని ఉద్యాన అధికారిణి సీహెచ్.గిరిజ తెలిపారు. **తెగులు ఆశిస్తుందిలా..** తోటలో వర్షం నీరు ఎక్కువగా నిల్వ చేరితే సిగటోగ ఆకుమచ్చ తెగులు వ్యాపించే అవకాశముంది. ఇది ముదురు ఆకులకు నష్టం కలిగిస్తుంది. ఉధృతి ఎక్కువైతే ఆకులు పసుపు రంగులోకి మారి మాడిపోతాయి.

నివారణ పద్ధతులు.. ★ పొటాషియం ధాతు లోపం ఆశించిన తోటల్లో ఆకుమచ్చ తెగులు అధికంగా ఉంటుంది. దీని నివారణకు 100గ్రా. యూరియా, 80గ్రా. ఎంవోపీ మొక్క నుంచి అడుగు దూరంలో రెండు వైపులా గాడీ తీసి ఎరువు వేసి మట్టితో కప్పాలి. ★ తోటలో వరద నీరు నిల్వ ఉంటే పొటాషియం, నైట్రేట్(13045) 5గ్రా. మందును లీటరు నీరు, జిగురు మందుతో కలిపి పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

గొర్రెల పెంపకంలో మెలకువలు అవసరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్రెలు పెంపకంలో మంచి ఫలితాలు పొందొచ్చని పశు వైద్యాధికారిణి డా.శైలజ తెలిపారు. ఈనడానికి సిద్ధంగా ఉన్న గొర్రెలను మూడు వారాల ముందుగా వేరు చేయాలి. ఈనే రోజు గడ్డితో పడక ఏర్పాటు చేసి, నీరు, దాణా అందుబాటులో ఉంచాలి. పుట్టిన పిల్ల, తల్లి కలిసి కనీసం రెండు రోజులు ఉండాలి. ఈనిన 8-12 గంటలు లోపు మాయ పడిపోవాలి. లేకపోతే పశువైద్యుడిని సంప్రదించాలి. 2 నెలల వరకు అదనంగా 200-250గ్రా. దాణా ఇవ్వాలి. 15రోజుల తర్వాత మేతకు బయటకు పంపించాలి. సుబాబుల్, అలసంద, పిల్లిపెసర వంటి పశుగ్రాసాలు మేపితే మంచిది. మూడు నెలల తర్వాత తల్లిని పిల్ల నుంచి వేరుచేయాలి.

కేటాయించి.. కష్టాల్లోకి నెట్టి


నిర్మాణాల మధ్య అధ్వాన పరిసరాలు


భూగర్భ డ్రైనేజీ పరిస్థితి ఇదీ..

సాలూరు పట్టణ శివారులోని టిడ్కో ఇళ్లు నివాసానికి దూరమవుతున్నాయి. 2019 ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం వీటికి శ్రీకారం చుట్టగా.. వైకాపా వచ్చాక పక్కనెట్టింది. 2021లో రివర్స్ టెండరింగ్ అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. రూ.47 కోట్లతో 1056 ఇళ్లను నిర్మించారు. 2024 ఫిబ్రవరి నాటికి పూర్తవగా.. లబ్ధిదారులకు కూడా అప్పగించారు. అయితే అప్పటికే రూ.3 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో గుత్తేదారు మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టలేదు. ఈ లోగా ఎన్నికలు రావడంతో ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దాదాపు 400 మంది విద్యుత్తు మీటర్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే తాగునీరు, విద్యుత్తు సరఫరా లేకపోవడంతో అక్కడికి ఎవరూ వెళ్లలేదు. ఇప్పటికీ రహదారులు, కాలువలు కూడా పూర్తికాలేదు. తాగునీటి వసతి కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. రెండో బ్లాక్ వద్దకు వెళ్లేందుకు ప్రతిపాదించిన ప్రధాన రోడ్డు ఇంకా ప్రారంభం కాలేదు. వీధి దీపాలు సైతం కానరావడం లేదు. దీనిపై టిడ్కో ఏఈ ప్రసన్నకుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యాయన్నారు. ప్రత్యేకంగా మౌలిక సదుపాయాల కల్పనకు గత ప్రభుత్వ హయాంలో రూ.8.75 కోట్ల నిధులు మంజూరైనా.. విడుదల కాకపోవడంతో గుత్తేదారు పనులు చేపట్టలేదని చెప్పారు. త్వరలోనే పూర్తిచేసి, లబ్ధిదారులు వచ్చేలా చూస్తామన్నారు.


భారీగా నిలిచిపోయిన వర్షపునీరు

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

చెప్పి ఊరెళ్తే చింత లేనట్లే..!

LHMS AP Police

శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో ఈ నెల 19న ఒకే రోజు రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. దుండగులు 13 తులాల బంగారం, 3 కిలోల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. వేలిముద్రలు సేకరించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాశీబుగ్గ పట్టణంలోని రోటరీ నగర్‌లో ఈ ఏడాది మే 25న ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. దొంగలు 46 తులాల బంగారు ఆభరణాలు, రూ.18 వేలు ఎత్తుకెళ్లిపోయారు.

ఫిబ్రవరి 27న కాశీబుగ్గ పోతనపల్లి వీధిలో దొంగలు పడ్డారు. ఓ ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని రూ.10 లక్షల నగదు, 15 తులాల బంగారం, 4 కిలోల వెండి వస్తువులు చోరీకి పాల్పడ్డారు.

- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దొంగతనాలకు అడ్డుకట్ట
- అవగాహన కొరవడటంతో పెరుగుతున్న చోరీలు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చెలరేగిపోతున్నారు. ముఖ్యంగా జిల్లాలోని నగరాలు, పట్టణాల్లోనే ఎక్కువగా చోరీలు జరుగుతున్నాయి. పోలీసులు రాత్రి వేళ గస్తీ కాస్తున్నప్పటికీ వాటి సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. దొంగతనాలకు అడ్డుకట్టవేసేందుకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని సూచిస్తున్నా ప్రజలు పట్టించుకోవట్లేదు. చేతుల కాలాక ఆకులు పట్టుకున్న చందంగా నష్టం జరిగిన తర్వాత పోలీసుస్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. అలా కాకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకుంటే ఇల్లు భద్రంగా ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.


పీఎన్ కాలనీలో చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు


ముందు ఏం చేయాలంటే..

మీ స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ అయ్యాక అందులో పేరు, వివరాలు నమోదు చేయాలి. మీ ఇంటి వద్ద నుంచే లాగిన్ అయ్యాక వన్ టైం పాస్‌వర్డ్, యూనిక్ ఐడీ వస్తాయి. అంతటితో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

ఇలా పట్టుకోవచ్చు..

ఊరు వెళ్లేముందు ఎల్ఎంహెచ్ఎస్ యాప్‌లో రిక్వెస్టు పోలీసు వాచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఏ తేదీ, ఏ సమయానికి వెళ్తారు.. తిరిగి ఎప్పుడొస్తారనే సమాచారం పొందుపరచాలి. వెంటనే ఆ వివరాలు కమాండ్ కంట్రోల్ రూంకి చేరతాయి. సిబ్బంది ఆ ఇంటికి వైఫైతో పనిచేసే నిఘా కెమెరా, ఇతర పరికరాలను అమరుస్తారు. ఆ ఇంట్లో ఎలాంటి కదలిక ఉన్నా కంట్రోల్ రూంలో సైరన్ మోగుతుంది. వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్, రక్షక్, బ్లూకోట్స్ వాహనాలకు సమాచారం వెళ్లి.. క్షణాల్లో పోలీసులు నేరుగా దొంగలను పట్టుకునేందుకు వీలవుతుంది. జిల్లావాసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకుని చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు సహకరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచిస్తున్నారు.

జిల్లాలో యాప్ వినియోగం ఇలా..



సనాతన ధర్మ పరిరక్షణకు పిలుపు

పార్వతీపురం పట్టణం, సీతానగరం, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలకు అండగా నిలవాలని జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆదాడ మోహనరావు పిలుపునిచ్చారు. బుధవారం వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నాయకులు కరుణ, దాలినాయుడు, జయకృష్ణ, గాయత్రి, జన సైనికులు పాల్గొన్నారు. ● తిరుమల లడ్డూ అపవిత్రతకు పాప పరిహారంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సీతానగరం మండలం లచ్చయ్యపేట వేంకటేశ్వరాలయంలో బొబ్బిలి జన సైనికులు పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.అప్పలస్వామి ఆధ్వర్యంలో జనసైనికులు పూజల్లో పాల్గొన్నారు.


వెంకటేశ్వర ఆలయంలో జనసేన నాయకులు, జన సైనికులు

పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

పాచిపెంట, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో అనంత లక్ష్మి తెలిపారు. మడవలస అంగన్‌వాడీలో పౌష్టికాహార మాసోత్సవాలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం, ప్రదర్శన నిర్వహించారు. నెలలు నిండిన గర్భిణులు సాలూరు వసతి గృహంలో చేరాలన్నారు.